క్లుప్తంగా

కొండయ్యకు మెరిటోరియస్ అవార్డు


ఉప కులపతి జానకీరామ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కొండయ్య

అంబాజీపేట: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న పెనుగొండ మాల కొండయ్య మెరిటోరియస్ ఎంప్లాయీస్ అవార్డు అందుకున్నారు. బుధవారం తాడేపల్లిగూడెం సమీపంలో ఉన్న వెంకట రామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కొండయ్యకు ఈ అవార్డును బహూకరించారని స్థానిక కొబ్బరి పరిశోధనా కేంద్ర ఇన్‌చార్జి అధిపతి డా.వి.గోవర్ధన్‌రావు తెలిపారు. ఈ అవార్డును ఉద్యాన విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ చేతుల మీదుగా కొండయ్య అందుకున్నట్టు చెప్పారు. కొబ్బరి పరిశోధనా కేంద్రం విస్తరణాధికారిగా కొండయ్య చేసిన సేవలకు ప్రతిగా ఈ అవార్డుతో పాటు, రూ.2,500 నగదు, ప్రశంసాపత్రం అందించారన్నారు. కొండయ్యకు అవార్డు లభించడంపై డా.గోవర్ధన్‌రావు, శాస్త్రవేత్తలు బి.నీరజ, డాక్టర్ వి.అనూష, ఎ.కిరీటి తదితరులు అభినందించారు.

ఆదర్శనీయురాలు హెలెన్ కెల్లర్


హెలెన్ కెల్లర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

రాజోలు: ప్రముఖ రచయిత హెలెన్ కెల్లర్ ఆదర్శనీయురాలని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు అన్నారు. గురువారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిష్ ఆధ్వర్యంలో హెలెన్ కెల్లర్ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. హెలెన్ కెల్లర్ కంటి చూపు, వినికిడి లేకపోయినా గొప్ప రచయితగా, వక్తగా పేరుగాంచారన్నారు. అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్ సంస్థను స్థాపించి ఆమె అనేక మంది దివ్యాంగులకు సహకారం అందించారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, నల్లి రాజు, అశ్వనీ రెడ్డి, శైలజ, రాజ్‌కుమార్, శ్రీరామమూర్తి, రామయ్య, ప్రతాప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నడిమిలంకలో ప్రత్యేక వైద్య శిబిరం



నడిమిలంకలో ఓ ఇంటి వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలేనికి చెందిన నడిమిలంకలో గురువారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ గ్రామంలో ఎక్కువగా పక్షవాతం, గుండె సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లాకు పలువురు ఫిర్యాదు చేశారు, దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు రోగులను పీహెచ్‌సీ వైద్యులు పి.కృష్ణకుమార్, సౌజన్య పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ, అమలాపురం ప్రభుత్వాస్పత్రులకు సిఫార్సు చేశారు. మొత్తం గ్రామంలో 60 మంది రోగులను పరీక్షించగా, 14 మందికి మధుమేహం, 46 మందికి బీపీ ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. అలాగే వైద్య సిబ్బంది గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు

అయినవిల్లి: మండలంలోని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై 2023–2024 సంవత్సరానికి సామాజిక తనిఖీల్లో భాగంగా నేదునూరు, శంకరాయగూడెం గ్రామాల్లో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎస్ఆర్పీ వి.కనకారావు ఆధ్వర్యంలో డీఆర్పీలు, గ్రామ సోషల్ ఆడిట్ బృందాలు క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీలు చేశాయి. నివేదికలను గ్రామసభలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులకు వివరించారు.

పాఠశాలకు ఫ్యాన్ల బహూకరణ


పాఠశాలకు ఫ్యాన్లు బహూకరిస్తున్న ఎంఈఓ

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరంలోని జెడ్పీ హైస్కూల్‌కు గురువారం ఎంఈఓ చోడిశెట్టి ఆంజనేయులు రూ.15 వేల విలువైన సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీవీ రావు ఎంఈఓకు కృతజ్ఞతలు తెలిపారు.

షట్టర్లు అవుట్.. గోడలు ఫాల్

- మెండుపాలెం అవుట్‌ఫాల్ స్లూయిజ్ దుస్థితి
- ఊడుతున్న షట్టర్లు
- బీటలు వారిన గోడలు
- ఆందోళనలో రైతాంగం


మెండుపాలెం వద్ద శిథిల స్థితికి చేరిన అవుట్‌ఫాల్ స్లూయిజ్


దెబ్బతిన్న స్లూయిజ్ సపోర్టు దిమ్మలు

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం శివారు మెండుపాలెం వద్ద అవుట్‌ఫాల్ స్లూయిజ్ పూర్తిగా శిథిల స్థితికి చేరింది. పూర్వకాలంలో నిర్మించిన ఈ స్లూయిజ్ షట్టర్లు, వీటికి సపోర్టుగా ఉన్న సిమెంట్ దిమ్మలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సపోర్టు గోడలు బీటలు వారడంతో.. స్లూయిజ్ మొత్తం డ్రెయిన్‌లో కూలిపోతుందా అన్నట్టుగా ఉందని స్థానికులు చెబుతున్నారు. గ్రామ శివారు మెండుపాలెం వద్ద శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌కు ఏర్పాటు చేసిన ఈ స్లూయిజ్ పునర్నిర్మాణ పనులకు అధికారులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మీడియం డ్రెయిన్ల సమ్మేళనం

శంకరగుప్తం మేజర్ డ్రెయిన్‌లో అనేక మీడియం, మైనర్ డ్రెయిన్లు అనుసంధానంగా ఉన్నాయి. వీటిపై సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు మండలాల్లోని సుమారు 17 వేల ఎకరాల ముంపు నీరు దిగాల్సి ఉంది. అయితే స్లూయిజ్ ద్వారా నీరు దిగడానికి బదులుగా, సముద్రం నుంచి ఉప్పునీరు పోటెత్తి, దెబ్బతిన్న తలుపుల నుంచి తిరిగి డ్రెయిన్‌లోకి వస్తోందని ఆయకట్టు రైతులు అంటున్నారు. కేశవదాసుపాలెం సరిహద్దు నుంచి ప్రారంభమయ్యే శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ మామిడికుదురు మండలం వరకూ విస్తరించి, కరవాక వద్ద వైనతేయ నదిలో కలుస్తోంది. డ్రెయిన్‌లో మురుగు నీరు సక్రమంగా దిగేందుకు గతంలో ఈ డ్రెయిన్‌ను అధికారులు రెండుగా విభజించారు. ఇందులో ఒక భాగం కేశవదాసుపాలెం శివారు మెండుపాలెం వద్ద సముద్రంలో కలిసేలా, దీనికి సంబంధించిన అవుట్‌ఫాల్ స్లూయిజ్ అప్పట్లో నిర్మించారు.

ప్రతిపాదనలు పంపిస్తాం

గతంలో అవుట్‌ఫాల్ స్లూయిజ్ షట్టర్ల మరమ్మతులకు మాత్రమే ప్రతిపాదనలు పంపించాం. అయితే ప్రస్తుతం స్లూయిజ్ మొత్తం పునర్నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీంతో ఈ దిశగా మళ్లీ కొత్తగా తగిన ప్రతిపాదనలు పంపించాల్సి ఉంది.
– ఆనంద్, శంకరగుప్తం మేజర్ డ్రెయిన్, జేఈ, రాజోలు

తాగునీటి సరఫరాకు నేడు అంతరాయం


పోతవరం వద్ద పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని మంచినీటి ప్రాజెక్టు నుంచి పలు గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే గ్రావిటీ పైపులైన్‌కు పోతవరం వద్ద లీకులు ఏర్పడ్డాయి. దీంతో ఆ పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కల్యాణ చక్రవర్తి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని పి.గన్నవరం, పోతవరం, ముంగండ, ముంగండపాలెం, కె.ఏనుగుపల్లి, కె.ముంజవరం, యర్రంశెట్టివారి పాలెం, ఆర్.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి, ఎల్.గన్నవరం గ్రామాలకు శుక్రవారం తాగునీటి సరఫరా ఉండదని వివరించారు.

వాటర్ ట్యాంకుల పరిశుభ్రతే కీలకం


చింతలూరులో వాటర్ ట్యాంకులను పరిశీలిస్తున్న డీపీఓ రాంబాబు

ఆలమూరు: నిత్యం వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా సీజనల్, అంటు వ్యాధులను నివారించవచ్చని జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు అన్నారు. మండలంలోని ఆలమూరు, పెదపళ్ల, పినపళ్ల, చింతలూరు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎ.మేరీరోజ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పి.పద్మతో కలిసి ఆయా గ్రామాల్లోని ఆరు వాటర్ ట్యాంకులను పరిశీలించారు. వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేస్తున్న విధానాన్ని ఆరా తీశారు. అలాగే వాటర్ ట్యాంకుల ఆవరణ ప్రదేశాలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. ప్రతి వెయ్యి లీటర్లకు రూ ఐదు గ్రాముల చొప్పున బ్లీచింగ్‌ను కలపాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా పంచాయతీరాజ్, వైద్యారోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీపీఓ రాంబాబు విజ్ఞప్తి చేశారు. క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న సురక్షిత మంచినీటి సరఫరాపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని గ్రామ స్థాయి సిబ్బందిని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు కె.సంజీవ్‌రెడ్డి, వి.వేని, సీహెచ్ వెంకటరెడ్డి, ఎస్.వీర్రాజు, ఎంఎల్‌హెచ్‌పీలు వి.సువర్చల, కె.కళాంజలి, కె.సుమాంజలి, శ్వేత, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోటరీ సేవలు అభినందనీయం


ట్రై సైకిళ్లు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

రాజోలు: ప్రపంచ వ్యాప్తంగా రోటరీ అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు రొటేరియన్లు అన్నారు. గురువారం రాజోలు రోటరీ క్లబ్‌లో అధ్యక్షుడు ఏడిద కవీంద్ర అధ్యక్షతన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ బసవ వరహాలు దంపతుల ఆర్థిక సాయంతో పాలగుమ్మి గ్రామానికి చెందిన మహిళకు కుట్టుమెషీన్ అందజేశారు. దివ్యాంగులైన మెరపాలెం గ్రామానికి చెందిన పున్నం సాయిబాబు, శివకోడు గ్రామానికి చెందిన ఏడుకొండలుకు లక్కింశెట్టి రత్నబాబు, బోళ్ల శ్రీను సహకారంతో ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. పేదరికంతో చదువు ఆగిపోకుండా రాజోలుకు చెందిన ముత్యాల లేఖ్య, పెదపట్నం లంక గ్రామానికి చెందిన గిడుగు శ్రీరాముడుర్గకు రూ.5 వేల వంతున ఆర్థికసాయాన్ని లక్కింశెట్టి రత్నబాబు అందజేశారు. రోటరీ పీడీజీ డాక్టర్ బసవ వరహాలు దంపతులను రాజోలు రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. రోటరీ కార్యదర్శి చిట్నీడి లక్ష్మణరావు, రొటేరియన్లు దార్ల పెదబాబు, నామన షణ్ముఖేశ్వరరావు, దంగేటి సురేష్, కసుకుర్తి రామకృష్ణ, బోళ్ల శ్రీనివాస్, మొహిద్దీన్ కిష్వర్, ఐ.సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు సమష్టి కృషి


జొన్నాడలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: ప్రాణాంతకమైన మలేరియా నివారణకు అందరూ కృషి చేయాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ప్రధాన వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం వైద్యారోగ్య సిబ్బంది ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు, మలేరియా వ్యాధి వ్యాప్తి, నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. జ్వర పీడితులు సత్వరమే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రక్త పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అడిగిన అనేక సందేహాలను వైద్యారోగ్య శాఖ అధికారులు నివృత్తి చేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

విద్యతోనే భావి తరాలకు భవిష్యత్తు

డీఈఓ కమలకుమారి


అంబాజీపేటలో ర్యాలీని నిర్వహిస్తున్న డీఈఓ కమలకుమారి

అంబాజీపేట: చదువుతోనే భావితరాలకు బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందనే విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రహించి, పిల్లలను పాఠశాలలకు పంపాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి అన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏంఈఓ–1 కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నేను బడికి పోతా విద్యా ప్రవేశ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ కమలకుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో పాఠశాలలకు వచ్చే కోరికను కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని, దానికి విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ నెల 6 నుంచి జూలై 12 వరకు నెల రోజుల పాటు క్షేత్ర స్థాయిలో సర్వే చేసి, బయట తిరుగుతున్న 6 నుంచి 14 ఏళ్ల బడిఈడు పిల్లలను స్కూళ్లలో చేర్పించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఎంపీడీఓ చైర్మన్‌గా ఆయా గ్రామాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, సోషల్ వెల్ఫేర్ కమిటీ, పేరెంట్స్ కమిటీ, ఐసీడీఎస్ సిబ్బంది, సచివాలయ సోషల్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు బృందంగా ఏర్పడి, బయట తిరుగుతున్న పిల్లలను గుర్తించాలన్నారు. వారి తల్లిదండ్రుల సహకారంతో బడిలో చేర్పించాలన్నారు. బడి ఈడు పిల్లలందరినీ స్కూళ్లలో చేర్పించి, బడి బయట పిల్లల్లేని గ్రామాలుగా ప్రకటించుకోవాలన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లతో పాటు, విద్యా ప్రోత్సాహకాలపై పిల్లల తల్లిదండ్రులకు తెలపాలన్నారు. కమిటీలు బాధ్యతగా వ్యవహరించి, ప్రతి ఇంటిని సందర్శించాలన్నారు. అనంతరం నేను బడికి పోతా అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏపీసీ మధుసూదనరావు, ఎంపీడీఓ జి.సరోవర్, డీవైఈఓ కె.సూర్యప్రకాశరావు, ఏపీఓ ఎంఏకే భీమారావు, ఏఎల్ఎస్ కో–ఆర్డినేటర్ జి.రమేష్, తహసీల్దారు జె.విమలకుమారి, ఎంఈఓ–2 మోకా ప్రకాష్, హెచ్‌ఎంలు కె.సాయిరామ్, పీవీ కేశవాచార్యులు, పంచాయతీ కార్యదర్శులు జీజీవీకే కుమార్, వి.లక్ష్మీపతి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్పీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

గెయిల్ బాధితులకు అండగా నిలుస్తా

ఎమ్మెల్యే గిడ్డి


గెయిల్ ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: నగరం గెయిల్ పైపులైన్ విస్ఫోటనంలో మృత్యువాత పడిన వారి కుటుంబాలకు అండగా నిలుస్తానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ భరోసా ఇచ్చారు. విస్ఫోటనం జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలో గురువారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పేలుడులో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ప్రమాదం జరిగి పదేళ్లు కావస్తున్నా బాధితులకు నేటికీ న్యాయం జరగలేదని స్థానికులు జాలెం సుబ్బారావు, ముకరం హుస్సేన్, బోణం పెద్దిరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. గెయిల్ అధికారులు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదన్నారు. బాధితులకు ఇచ్చిన హామీలపై గెయిల్ అధికారులతో మాట్లాడతానని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. అప్పటికీ న్యాయం జరగని పక్షంలో నేరుగా తానే గెయిల్‌పై ప్రత్యక్ష పోరాటం చేస్తానన్నారు. బాధితులకు న్యాయం చేయకపోవడం దారుణమని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నామన రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సర్పంచ్ జాలెం రమణకుమారి, ఎంపీటీసీ జాలెం అనూష, ఉప సర్పంచ్ అన్వర్‌తాహిర్ హుస్సేన్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, కో–ఆప్షన్ సభ్యుడు నూరైన్ అబ్బాస్ పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ముందుగా నగరం పంజీషాలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ముస్లింలు ఘనంగా సన్మానించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి


పి.గన్నవరం: గ్రామాల్లో జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆదేశించారు. అలాగే ప్రజలకు సురక్షిత తాగునీటి సరఫరా, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై గురువారం ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరైనా వ్యాధులు, జ్వరాలకు గురైతే వెంటనే వైద్య సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేయడం ద్వారా వ్యాధులను తొలిదశలోనే గుర్తించవచ్చన్నారు. పరిసరాల పరిశుభ్రతపై పంచాయతీ, సచివాలయాల సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ సీహెచ్.త్రిశూలపాణి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ఆదిమూలం సూరయ్యకాపు, వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పద్మనాభం, జేఈ కల్యాణ చక్రవర్తి, వైద్యారోగ్య శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

తాళ్లరేవు: కోరంగి ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం పాతకోరంగిలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వైద్యురాలు ఎం.విజయ ప్రతిభ రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సిబ్బంది ఎం.కోటేశ్వరరావు, ఆశా కార్యకర్త నాగమణి, యోగా శిక్షకులు కరుణాకర్, మహాలక్ష్మి పాల్గొన్నారు.

వానాకాలం.. జరభద్రం!

- ప్రబలుతున్న అంటువ్యాధులు
- డయేరియాతో జాగ్రత్త
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పంటున్న వైద్యులు



డయేరియాకు సంబంధించిన చిత్రం

అంబాజీపేట: వానాకాలం వచ్చింది. అంటువ్యాధులు విజృంభిస్తున్నాయి. అందులో ముఖ్యమైనది అతిసార(డయేరియా). ఈ వ్యాధికి సకాలంలో వైద్యం అందించకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. వ్యాధి బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రధానంగా తాగునీరు కలుషితం కావడం వల్లే డయేరియా వ్యాపిస్తుంది. ఇక అపరిశుభ్రత కారణంగా డయేరియా ప్రబలే అవకాశం ఎక్కువ.

వ్యాధి లక్షణాలు

విరేచనాలు నీళ్లలాగా, పలచగా అవుతుందంటే డయేరియా అని అర్థం. వైద్య పరిభాషలో దీన్ని గ్యాస్ట్రో ఎంటర్‌రైటిస్‌గా పిలుస్తారు. ఈ వ్యాధి జీర్ణ వ్యవస్థకు సోకుతుంది. నీళ్ల విరేచనాలు నూటికి 70 శాతం వైరస్ క్రిముల వల్ల అవుతాయి. కలుషితమైన నీటిని తాగడం వల్ల, మలం మీద వాలిన ఈగలు కూర్చున్న ఆహార పదార్థాలు భుజించడం వల్ల వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలు అవుతాయి. విరేచనాలు పలచగా అవుతూ, కడుపులో మెలి పెట్టినట్టు నొప్పి ఉంటుంది. నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కలు నొప్పులు వస్తాయి. తాగే నీరు శరీరం నుంచి అధిక మొత్తంలో బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. డీహైడ్రేషన్‌లో నాడి వేగంగా లేదా బలహీనంగా కొట్టుకోవడం లేదా ఒక్కోసారి అసలు నాడీ తెలియకుండా ఉంటుంది, నీరసం, నోరు, నాలుక పిడచకట్టుకుపోవడం, శరీరం ఎండి పోవడం, ఒక్కోసారి మూత్రం అసలు రాకపోవడం లేదా చాలా తక్కువగా రావడం, ముదురు పసుపు రంగులో మూత్రం రావడం జరుగుతుంది. వయసుతో సంబంధం లేకుండా డీహైడ్రేషన్ వస్తుంది. దీనివల్ల పిల్లలకు, వృద్ధులకు ఎక్కువగా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

నిర్లక్ష్యం చేయవద్దు



విరేచనాలు రెండు లేక మూడు అయితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. అలా కాదు ఏమి అవ్వదు అనుకుంటే ప్రాణాలపైకి వస్తుంది. కలుషిత ఆహారం, తాగునీరు, అపరిశుభ్రత కారణంగా అతిసార (డయేరియా)కు గురయ్యే ప్రమాదముంది. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. బయట పదార్థాలు తినకూడదు. ఇంటిలో వండినవి మాత్రమే తీసుకోవడం మంచిది.
–జి.వి.సరోవర్, ఎంపీడీఓ,, అంబాజీపేట

నివారణ ఇలా..

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి. బయట ప్రాంతాల్లో ఆహారం తినడం మంచిది కాదు. ఉడకని మాంసం తినకూడదు. పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

ఎడతెరిపి లేని వర్షం

- రహదార్లు జలమయం
- స్తంభించిన జన జీవనం
- పంటలకు మేలంటున్న రైతులు


వర్షానికి చిత్తడిగా మారిన మామిడికుదురు-కొర్లగుంట రోడ్డు

మామిడికుదురు: వివిధ ప్రాంతాల్లో ఎడతెరిపి లేని భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. గురువారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో రోడ్లపై భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం రాత్రి నుంచి ఓ మాదిరిగా కురుస్తున్న వర్షంతో నగరం, మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల్లో 216వ నంబర్ జాతీయ రహదారిపై పలు చోట్ల వర్షపు నీరు నిలిచిపోయి, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, మాకనపాలెం, ఆదుర్రు, కొమరాడ, ఈదరాడ, మగటపల్లి, గోగన్నమఠం గ్రామాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంతో మొగలికుదురు కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముసురుతో తొలకరి సాగు కోసం వేసిన నారుమడులకు నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షం కొబ్బరి తోటలకు మాత్రం మేలు చేస్తోందని కొబ్బరి రైతులు సంతృప్తిగా ఉన్నారు.

సేద తీరిన జనం

అంబాజీపేట: అల్పపీడనం కారణంగా మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. రెండు వారాలుగా ఉక్కపోత, వేడిగాడ్పులతో అల్లాడిన వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఈ వర్షంతో కాస్త సేదతీరారు. రోడ్ల పక్కన చిరు వ్యాపారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెల్లవారుజాము నుంచి తెరిపి ఇవ్వకుండా, వర్షం కురుస్తుండడంతో జనజీవనం స్తంభించింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వరి సాగుకు, కొబ్బరి తోటలకు మేలు చేకూరుతాయని రైతులు చెబుతున్నారు.


అంబాజీపేటలో కురుస్తున్న వర్షం

గురుకుల ఉపాధ్యాయుడి మృతి

అల్లవరం: గోడి బాలుర గురుకులంలో డ్రాయింగ్ టీచర్ రాజ్‌కుమార్ అనారోగ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మరణించారు. ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురై ఎనిమిది నెలలుగా అనారోగ్యంతో ఉన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు సంతాపం తెలిపారు.